www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య



పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని కలెక్టర్ గిరీష పిఎస్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మహా గణపతి జిల్లా ప్రజలందరికీ విఘ్నాలను తొలగించి పరిపూర్ణమైన ఆయురారోగ్యాలను, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరారు. సోమవారం 'వినాయక చవితి' పర్వదినం సందర్భంగా వారు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.పండుగలు, వేడుకలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిబింబాలన్నారు. జిల్లా సుభిక్షంగా ఉండాలన్నారు. ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందుతూ పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల సమన్వయ సభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జఖియా ఖానం, విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ మిథున్ రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాధ్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

ప్రత్యామ్నాయానికి కసరత్తు

ఖరీఫ్‌లో 57 శాతమే సాగు

3,327 క్వింటాళ్ల విత్తన సరఫరా

వ్యవసాయ శాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు

ప్రత్యామ్నాయ పంటల సాగుకు కసరత్తు ఊపందుకుంది. ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాకు వరదాయనులైన తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటికొరత ఏర్పడింది. ఫలితంగా జిల్లాలోని కెసికెనాల్, బ్రహ్మంసాగర్ ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ జిల్లాలోని 432 ఆర్‌బికెల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించిన 3,327 క్వింటాళ్లను పొజిషనింగ్ చేసింది. ప్రత్యామ్నాయ పంటల సాగు పట్ల ఆసక్తి కలిగిన రైతులు ఆర్‌బికెలను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సరఫరా చేస్తామని పేర్కొంటున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.నాగేశ్వరరావుతో ప్రజాశక్తి ముఖాముఖి...

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి



ముఖా ముఖి..

ఖరీఫ్ సాగు విస్తీర్ణమెంత?

2023-24 ఖరీఫ్ సీజన్ 1,99,509 ఎకరాల సాగు విస్తీర్ణాన్ని కలిగి ఉంది. ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆశించిన రీతిలో పంటల సాగుకు అవకాశం లేకుండా పోయింది.

ఖరీఫ్ సాగు వివరాలు తెలపండి?

2023-24 ఖరీఫ్ సీజన్‌లో 1,99,509 ఎకరాల్లో పంటల సాగుకుగానూ 1,08,798 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈలెక్కన 57 శాతం విస్తీర్ణంలో సాగుకు నోచుకుంది. గతేడాది ఇదే సమయానికి 61 శాతం సాగు కావడం గమనార్హం. మిగిలిన సుమారు 90 వేల ఎకరాలను రబీ సీజన్‌లో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా రబీ సీజన్ బుడ్డశనగ విత్తనాల ప్రతిపాదనల్లో 35 వేల క్వింటాళ్ల నుంచి 75 వేల క్వింటాళ్లకు పెంచడం జరిగింది.

డ్రైస్పెల్స్ దాఖలాలేమైనా ఉన్నాయా?

వైఎస్ఆర్ కడప జిల్లాను రబీ ఆధారిత జిల్లాగా పరిగణించాలి. దీనికి గత సాగు చరిత్ర వివరాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు డ్రైస్పెల్స్ ఘటనలున్నాయి. జూన్, ఆగష్టు మాసాల్లో డ్రైస్పెల్స్ చోటుచేసుకోవడంతోనే సాగులో భారీ వ్యత్యాసం చోటుచేసుకుంది.

ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు తీరు తెలపండి?

జిల్లాలో ప్రత్యామ్నాయ ప్రణాళిక కింద మినుములు, పెసలు, జొన్న, అలసంద, ఉలవలు, కందుల విత్తనాలను పంపిణీ చేస్తాం. ఇందులో మినుములు 235 క్వింటాళ్లు, పెసలు 58 కందు లు 72, ఉలవలు 200, కొపి 100 క్వింటాళ్ల చొప్పున పొషజింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యాం.

డ్రోన్ టెక్నాలజీ లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున డ్రోన్ అందించాల్సి ఉంది. మొదటి విడతలో భాగంగా 30 మందిని గుర్తించడమైంది. ఇందులో 25 డ్రోన్స్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది.

ఇన్సూరెన్స్ సేవల గురించి చెప్పండి?


గ్రామ ఆధారితంగా వరి, జిల్లా ఆధారితంగా కందులు, జొన్న, మినుములు, ఉల్లి, పసుపు, మండల ఆధారితంగా సాగును బట్టి నిమ్మ, వేరుశనగ, పత్తి పంటలను ఎంపిక చేయడమైంది. సంబంధిత రైతుల తరుపున ప్రభుత్వమే నగదు చెల్లించి ఇన్సూరెన్స్ చేయడం జరుగుతోంది. ప్రకృతి ప్రకోపాల కారణంగా పంట నష్టా లు వాటిల్లినప్పుడు పరిహారం అందించడం జరుగుతుంది.

ఇ-క్రాప్ నమోదు ఎలా ఉంది?

ఇ-క్రాప్ నమోదు వేగవంతంగా సాగుతోంది. ఇప్పటికి 98 శాతం నమోదుతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో నాలుగో స్థానంలో ఉన్నాం. స్వల్ప వ్యవధిలోనే వంద శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం.

నష్టాల ఊబిలో 'బంతి' రైతులు

నాడు కిలో రూ.50.. నేడు రూ.5 - గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్



సాగులో ఉన్న బంతిపూలతోట

ప్రజాశక్తి - రామసముద్రం

గతంలో కిలో బంతి పూలు రకాలు ఏకంగా 40 నుండి 50 రూపాయలు పలకడంతో రైతు కళ్ళల్లో ఆశలు చిగురించాయి. అప్పుల ఊబిలో నుండి గట్టెక్కినట్లే అనుకుంటున్న తరుణంలో మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు కిలో బంతిపూలు ధరలు అమాంతంగా రూ.5 కు పడిపోవడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితిలేదని ఆందోళన చెందుతున్నారు. మండలంలో చెంబకూరు, కాప్పల్లి, పెద్దకురప్పల్లి, ఎలకపల్లి, కమ్మవారిపల్లి, నారిగానిపల్లి, రామస ముద్రం, చొక్కాండ్లపల్లి, ఊలపాడు,మాలేనత్తం, మూగవాడి, కుదురు చీమ నపల్లి, అరికెల, కురిజల, ఎలువనెల్లూరు, ఆర్.నడింపల్లి, మినికి, రాగిమా కులపల్లి పంచాయతిలలో రైతులు బంతిపూలు సాగు చేశారు. రైతు ఆశిం చిన స్థాయిలో గిట్టుబాటు ధరలు లేక పూల రైతులు విలవిలా డుతు న్నారు. పెట్టుబడులకు, కూలీలకు వేలకువేలు ఖర్చు చేస్తుంటే కనీసం పెట్టు బడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. కొందరు రైతులకు, పూల తోటలు కొన్న వ్యాపారస్తులకు కనీసం రవాణా ఖర్చులు కూడా రాకపో వడంతో పూలను తోటల్లోనే వదిలేసే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పూల రైతుల పరిస్థితి దయ నీయంగా మారింది. ఇది రామసముద్రం మండలం లోని పూలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి. మండలంలోని రైతన్నలు బిగ్ బాల్ , శ్రీలక్ష్మి, బిగ్ బాల్ ప్లస్, జర్మన్, హాస్టల్, శిల్పర్, గులాబీ, చాందిని, రూబిస్టార్ టైగర్, తది తర పంటలను సాగు చేస్తున్నారు. పూల సాగుకు ఎకరాకు రూ. 50 వేలు పెట్టుబడి అవసరం. విత్తనాలు కిలో రూ.3వేలు, అవుతుంది. కొందరు రైతులు నర్సరీలు నుండి ఒక్కో పూల మొక్క మూడు రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. నేల ఉబ్బిడి, వాతావరణం అనుకూలిస్తే దాదాపు రెండు నెలలు పూలు పూస్తాయి. పెళ్లిళ్ల సమయంలో కిలో పూలు రూ.30 నుంచి 40 వరకు వ్యాపారస్తులు కొనే వారు. దీంతో రైతుకు గిట్టు బాటు ధరలు అందేవి. ప్రస్తుతం కిలో పూలు రూ. 7 పలుకుతోంది. కనీసం కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లిళ్లు, పూజలు కొన్ని ప్రత్యేక సందర్భాలలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. కానీ పూలను కోయించేందుకు రోజుకు ఒక్కొక్కరికీ రూ.250 రూపాయలు కూలీ ఇవాల్సి ఉంది. ఉదయం 7 నుండి 11 గంటల వరకు , మధ్యాహ్నం12 నుంచి 3 గంటలవరకు సాయంత్రం 3 నుండి 6 గంటలవరకు రోజుకు మూడు దశల్లో పూలు కోయిస్తున్నారు. సుదూర ప్రాంతాలకు తరలించడానికి కనీసం రవాణా ఖర్చులు రాకపోవడంతో మదనపల్లి, చింతామణి, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. మరికొందరు రైతులు పూలను తోట ల్లోనే వదిలేస్తున్నారు. ప్రభుత్వం బంతి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పూలమండీలో బంతిపూలు



వినాయక విగ్రహం, మొక్కను పంపిణీ చేస్తున్న దాతలు

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణం హెల్పింగ్ మైండ్స్ కార్యాలయం వద్ద హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా 400 మట్టి వినాయకుల ప్రతిమలతో పాటు 400 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ మత సామరస్యాన్ని పెంపొందిస్తూ, సోదర భావంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుల ప్రతిమలు, మొక్కలు పంపిణీ చేశామన్నారు. వినాయకుని ప్రతిమను పూల కుండిలో నిమజ్జనం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, పురుషోత్తం, హనీఫ్, ఫయాజ్, రెడ్డి, కిరణ్, గౌతమ్, అమీన్, భాగ్యమ్మ, లక్ష్మి, పవన్ పాల్గొన్నారు. **పీలేరు :** ఉచిత మట్టి వినాయకుని బొమ్మలు వితరణ చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని శ్రీ సాయిబాబా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పంచాయతీ మెట్టపై బొమ్మల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణలో భాగంగా తాము ప్రతి సంవత్సరం వెయ్యి వినాయకుని మట్టి బొమ్మలను స్థానికులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎన్ వి చలపతి, వైసిపి నాయకులు కంభం భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ కంభం నరసింహారెడ్డి, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పీలేరు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రసాద్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోటూరి సురేంద్రనాధరెడ్డి మాట్లాడుతూ తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందంతో కంటి చూపు సమస్యలకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారని చెప్పారు. సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 20 మందిని ఐఒఎల్ ఆపరేషన్ల కోసం ఎంపిక చేశామన్నారు. వారిని శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఉచిత కంటి ఆపరేషన్‌తో పాటు మందులు కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో అరవింద కంటి వైద్యురాలు డాక్టర్ నందిని, వారి సిబ్బంది, లయన్స్ క్లబ్ కార్యదర్శి పురం సుబ్రమణ్యం, కోశాధికారి జయచంద్ర నాయుడు, లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ ప్రసాద్, సుధాకర్ రెడ్డి, పామిడి మహేష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాజ ఆణిముత్యం 'గానుగపెంట'

ప్రజాశక్తి- కడప అర్బన్

బ్రాహ్మణ సమాజంలో ఆణిముత్యం భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అని బ్రాహ్మణ సమైక్య గౌరవాధ్యక్షులు డాక్టర్ జి.గోపీనాథ్, అధ్యక్షులు జీవీ శివరావు, కార్యదర్శి మాచిరాజు రమణయ్య, శాస్త్రి మ్యాట్రిమోనియల్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస శాస్త్రి, అర్చక పురోహిత సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధీర్ శర్మ ప్రశంసించారు. ఆదివారం నగరంలోని సంస్థ కార్యాలయంలో జిల్లా బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్వాన్ డాక్టర్ గానుగపెంట హను మంతరావు 77 ఏళ్ల వయస్సులోనూ ఆటు సాహితీ సేవ, ఇటు సమాజసేవ ఒంటి చేత్తో చేస్తున్నారన్నారు. మహాకవయిత్రి మొల్లమాంబకు అఖండ కీర్తిని ఆర్జించి పెట్టిన సాహితీ కోవిదుడని కొనియాడారు. హనుమంతరావు జన్మదినం బ్రాహ్మణ సమాజానికే పెద్ద పర్వదినమని అభివర్ణించారు. అనం తరం రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ సమాచార పుస్తకం ఆవిష్క రించారు. అంతకుముందు హనుమంతరావును శాలువలు, కానుకలు, జ్ఞాపిక లతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు ముని రామచంద్రరావు, శంకర నారాయణ, నరసింహారావు, ఉమా మహేశ్వరరావు, శ్రీమతి లక్ష్మీదేవి, బాలాజీ, నాగరాజు, పద్మావతి, శివశంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని గానుగపెంట హనుమంతరావు సేవలను ప్రస్తుతించారు. తనకు చేసిన సత్కారానికి కృతజ్ఞతలను తెలియజేశారు.

పాత పెన్షన్‌ను మాత్రమే అంగీకరిస్తాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజా

ఉద్యోగ,ఉపాధ్యాయులు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆగ మేఘాలపై జిపిఎస్ అనే దుర్మార్గపూరితమైన పెన్షన్ విధానాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురావడానికి ప్రయత్నం చేయడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం కడప యుటిఎఫ్ భవన్ లో జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ అధ్యక్షతన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకి స్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం జిపిఎస్ విధానాన్ని అమలు పరచడానికి ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తుందో సమాధానం చెప్పాలన్నారు. సిపిఎస్, జిపిఎస్ రెండూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు విరమణ అనంతరం తీవ్ర నష్టాన్ని చేకూరుస్తాయని పాత పెన్షన్ విధానం మాత్రమే ఆమోదయోగ్యంగా ఉంటుందని వారు తెలిపారు. ముఖ్యమంత్రి సైతం ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతి అని చెప్పుకుంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంభించడం మంచిది కాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో చెప్పిన మాటకనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు కోరారు. ఉపాధ్యాయులపై మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించి వారి సమస్యలను పరిష్కరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, కేజీబీవీలో పనిచ ేస్తున్న ఉపాధ్యాయులందరినీ రెగ్యులర్ చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు జీతాలు అందని పరిస్థితి ఉన్నదని వారికి వెంటనే జీతాలు చెల్లించాలని, పెన్షనర్లకు డిఎ అరియర్స్ ఏక మొత్తంలోనే జమచేయాలని జిల్లా కౌన్సిల్ తీర్మానించిందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకపోతే ఉద్యమ కార్యాచరణ చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు చెన్నయ్య చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, చంద్ర ఓబుల్ రెడ్డి ,ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్య మేరీ, నాయకులు కరీముల్లా కిరణ్ కుమార్, ఈశ్వర రావు, వీరనారాయణ, శివకుమార్ రాజు, శశిధర్, శ్రీహరి, శ్రీకాంత్, నాగరాజు, దేవదత్తం, శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి

- టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక్‌నాథరెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట




క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక్‌నాథరెడ్డి

టి.సదుం ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్, టి.సదుం ద్వారకనాథ్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో వాలంటీర్ జయచంద్ర జ్ఞాపకార్థం ఆదివారం ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ఘనంగా ఏర్పాటు చేశారు. టి.సదుంలోని చెక్ పోస్ట్ వద్ద గల సోమసముద్రం గుప్తగారి మైదానంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటా ్డడుతూ ఇటువంటి టోర్నమెంటులను యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.22,222 వేలు నగదుతోపాటు మూడు జట్లకు టిషర్టులను జంబుకానికిపల్లెకి చెందిన జిల్లా వైసిపి సోషల్ మీడియా కో-కన్వీనర్ రవిచంద్రారెడ్డి అందిస్తారని, రన్నరఫ్‌గా నిలిచిన జట్టుకు రూ.11,111 వేలు నగదును వైస్ సర్పంచ్ మధుకర్‌రెడ్డి ఇస్తారన్నారు. మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,555తోపాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.1,111, మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ రూ.555 ఆర్.నవీన్ కుమార్ రెడ్డి,క్రీడాకా రులకు భోజన సదుపాయం ఆర్ఎంపి బొమ్మే వెంకటరమణ, ట్రోఫీని అంకాల మడుగు ఎఎస్.భరత్ డోనర్లుగా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో పెద్దతిప్ప సముద్రం మండల ఎంపిపి మహమ్మద్, ఉప సర్పంచ్ మధుకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అలీఖాన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో ఓ రైతు జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిమ్మనపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకున్న ఘటనపై బాధితుని కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మనపల్లి మండలం, వెంగళకురప్పల్లికి చెందిన రైతు వెంకటరమణ (48) ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు కారణంగా జీవితం పై విరక్తి చెందాడు. వినాయక చవితి పండుగకు సరుకులు తీసుకురావాలని భార్య కోరడంతో ఆర్థిక సమస్యల కారణంగా తీసుకురాలేకపోయాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన రైతు పొలం దగ్గరికెళ్ళి టమోటా పైరుకు కొట్టడానికి తెచ్చి ఉంచిన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి అతన్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నాడు.



చికిత్స పొందుతున్న రైతు వెంకటరమణ



బిసి నాయకుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నల్లారి తనుజా రెడ్డి

పార్టీ క్యాడర్ సంరక్షణ మా బాధ్యత

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వారిని ఆదుకుంటూ క్యాడర్‌ను కాపాడుకోవడం తమ బాధ్యత అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనుజా రెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె పీలేరు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా వైసిపి తప్పుడు కేసుల్లో చిక్కుకున్న బాధిత కుటుంబాలకు వెళ్లి వారిని పరామర్శించి, మానసిక ధైర్యాన్ని వారికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించడం బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ పెరుగుతున్న జనాదరణను చూసి ఓర్వలేక, పార్టీ క్యాడర్‌ని నేరుగా ఎదుర్కొనే సామర్థ్యం లేక ఇలా దొడ్డిదారిన తప్పుడు కేసులు బనాయిస్తూ కార్యకర్తలను భయభ్రాంతులకు లోను చేయాలని కుతంత్రాలు పన్నారని ఆరోపించారు. ఎవరెన్ని చేసినా టిడిపి క్యాడర్ భయపడదని 2024 సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతరంగా ఎదుర్కొని తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీని అందించి నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీలర్

సమాజ సేవలోనూ ముందుంటాం

ప్రజాశక్తి-మదనపల్లె

వ్యాపారంలోనే కాదు సమాజ సేవలో కూడా ఎల్లప్పుడూ ముందుంటామని తిరుపతి ఇండియన్‌ఆయిల్ కార్పొరేషన్ సేల్స్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, మదనపల్లె ఇండియన్ ఆయిల్ డీలర్ వినోద్ తెలిపారు. ఆదివారం డ్రైవర్స్ డే సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లె బసినికొండ లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ సహకారంతో మదనపల్లి టౌన్ పుంగనూరు రోడ్డు వై జంక్షన్‌లో లారీ అసోసియేషన్ సహకారంతో డ్రైవర్లకు, క్లీనర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వ్యాపార రంగంలోనేగాక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. అనంతరం లారీ డ్రైవర్లకు,క్లీనర్లకు ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్ లు,క్లీనర్లు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి : విద్యుత్ ఎస్ఇ

కడప : వినాయక పందిళ్లకు విద్యుత్ లోడును, వాడకడాన్ని బట్టి రుసుములు చెల్లించి తాత్కాలికంగా విద్యుత్ వాడు కోవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. ఆదివారం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో వినాయక చవితిని పురస్కరించుకొని వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాల ప్రజల నుద్దేశించి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినాయక పందిళ్లకు ఉపయోగించే విద్యుత్ వైర్లను అతుకులు లేకుండా నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు ఉపయోగించాలని తెలి యజేశారు. ప్రమాదాలు జరగకుండా భద్రత ప్రమాణాలను పాటించాలని సూచి ంచారు. విధిగా విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలని తెలియజేశారు. విద్యుత్తు లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పందిళ్లు ఏర్పాటు చేయకూడదు అని తెలిపారు. సాధ్యమైనంత వరకు పందిళ్లకు ఇనుప పైపులు బదులు కొయ్యలు లేదా ప్లాస్టిక్ పైపులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు


సౌమ్యనాథుని ఆయలంలో పూర్వపు ఎస్‌పి గంగాధర్‌రావు

సౌమ్యనాథుని సన్నిధిలో గంగాధర్‌రావు

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చారిత్రాత్మక, ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామిని జిల్లా పూర్వపు ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు పూలమాల, శాలవాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-నందలూరు

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతిలో భాగంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తూ ఉన్నత పాఠశాలకు పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎన్.శామ్యూల్, జి.నిత్యపూజయ్యలను యుటిఎఫ్ నందలూరు మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒలు ఎల్.నాగయ్య, సిఆర్ అనంత క్రిష్ణ మాట్లాడుతూ శామ్యూల్, నిత్య పూజయ్యలు మండలంలో పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యాభివృద్ధి పరంగా నందలూరు కీర్తిప్రతిష్టలు పెంచారని కొనియాడారు. వృత్తి పరంగా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులను తయారు చేశారని అభినందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిల్లా హరిప్రసాద్, స్థానిక యుటిఎఫ్ నాయకులు షేక్ రౌఫ్ బాషా, వై.మస్తాన్‌రెడ్డి, కె.రమేష్, జి.కృపానందం పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి-కలకడ

చవితి ఉత్సవాలకు వినాయక విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లను సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో విగ్రహాలను ఎన్నడు లేనివిధంగా వినాయక చవితికి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. .ఆదివారం సాయంత్రానికి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన సమాచారం మేరకు సుమారు 35 విగ్రహాలను ఏర్పాటు కోసం అనుమతులు కోరినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఉదయానికి మరికొన్ని విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు భక్తులు అనుమతుల కోరే అవకాశాలున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులతో ఎస్ఐ మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని గుర్తు చేశారు. గ్రామాలలో ఏవైనా ఘర్షణలు చోటు చేసుకుంటే కమిటీ సభ్యులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరిబాబు పాల్గొన్నారు. **రామాపురం :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణనాథుల ప్రతిమలను కొలువు తీరడానికి గ్రామాలకు తరలిస్తున్నారు. కడప, రాయచోటి తదితర పట్టణ ప్రాంతాల నుంచి భారీ వాహనాలలో భారీ గణనాథుల ప్రతిమలను తరలిస్తున్నారు. మండలంలో 13 గ్రామపంచాయతీలలో వందకు పైగా ప్రతిమలను ఈ పండుగ లో కొలువు తీరడం విశేషం. **సింహాద్రిపురం :** ఆది నాయకుడైన వినాయకుడి పండగ పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని మండపాల వద్ద సందడి నెలకొంది. సోమవారం వినాయక చవితి సందర్భంగా యువత పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వినాయక విగ్రహాలను దూర ప్రాంతాల నుంచి కొను గోలు చేసి స్వగ్రామంలోని మండపాల వద్దకు చేర్చడంతోపాటు మండ పాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. విద్యుదీపాలతో మిరమిట్లు గొలిసేలా ఏర్పాట్లు చేశారు. యువత, పిల్లల కోలాహలంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైద్య విధాన పరిషత్ ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఆయుష్మాన్ భవ ఆరోగ్యమేళా జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షబానా ఫాతిమా తెలిపారు. గర్భిణులు ప్రసవ సంబంధిత సమస్యలు, చిన్నపిల్లల సమస్యలు, చెవి, ముక్కు గొంతు ,మానసిక ఆరోగ్య సమస్యలపై వైద్య నిపుణులు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు అన్నారు. అవసరమైతే ఉచితంగా శస్త్ర చికిత్సలకు కూడా చేయడం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భవ పథకంలో గ్రామీణ పేద ప్రజలకు అన్ని రకాల అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయితీ పరిధిలో 'మన ఊరి కోసం టీం', 'మల్లు ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆదివారం వంద మట్టి వినాయక విగ్రహాలను, 100 మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లు గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ అఫ్ పారిస్ ఉపయోగించి తయారు చేసే విగ్రహాలతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను వాడాలని ప్రజల్లో చైతన్యం తేవడం కోసం యువకుల ప్రయత్నం హర్షించదగ్గ విషయమన్నారు. మల్లు ఫౌండేషన్, మన ఊరి కోసం టీం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మన ఊరి కోసం టీం సభ్యులు మల్లు నాగార్జునరెడ్డి, యుధిష్టర్, తులసిరెడ్డి, శ్రీనివాసులు, చలపతి, శివ ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, రామాంజనేయరెడ్డి, రిషికేశవరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మినీ యువగళంలా ప్రవీణ్ పాదయాత్ర

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :

ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర మినీ యువగళంలా ఉందని మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ వైఎస్ జాబీవుల్లా పేర్కొన్నారు. ఆదివారం మహమ్మదీయ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా తమ నాయకుడు చంద్రబాబు కోసం తిరుమల పాదయాత్ర మొదలుపెట్టారన్నారు. అడుగడుగునా ప్రవీణ్‌కు జనం నీరాజనం పలుకుతున్నారన్నారు. పాదయాత్ర ముగియగానే నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ గౌస్, పాణ్యం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మట్టి వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టిద్దాం-పర్యావరణాన్ని కాపాడుకుందామని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు కమిటీ ఆధ్వర్యంలో నాగార్జున హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ నాగార్జున, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్ వాడకుండా అందరం మట్టి వినాయకుని విగ్రహాలను ప్రతిష్టిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రదీప్, శ్రీహరి, సత్య పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కెజిబివి విద్యార్థులు


పిచ్చిమొక్కలతో నిండిన క్రీడా మైదానం, దోబిఘాట్

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు సమస్యల వలయంలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సరైన మౌళిక వసతులు లేక కొట్టుమి ట్టాడుతున్నారు. పాడైన పోయిన మరుగుదొడ్లకు నాలుగేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు.ప్రస్తుతం అవి పనిచేయక పోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఆర్ఎంఎస్‌లో ఇటీవల నిర్మించిన నూతన భవ నాల్లో కూడా మరుగు దొడ్లు నిర్మించలేదు. గతంలో నాలుగు సంవత్సరాల క్రితం వ్యాయామ ఉపాధ్యాయురాలు బదిలీపై వెళ్లగా, నాలుగేళ్ల తర్వాత నూతనంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు పాఠశాలకు వచ్చినా ఆట స్థలం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపో యింది. పాఠశాల ప్రారంభ దశలోనే ఉపాధ్యాయురాలు అందుబాటులో ఉన్న ఆట స్థలంలో మొక్కలు తొలగించక పోవడంతో మైదానం అడవిని తలపిస్తుంది. పాఠశాల మొత్తంలో 225 మంది విద్యార్థులు ఉండగా అందులో ఇంటర్ విద్యార్థులు 30 మంది వరకు ఉన్నారు. వీరిలో ప్రత్యేకంగా కేటాయించిన నూతన భవనంలో మరుగుదొడ్ల సమస్య బాధిస్తుందని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక, జిల్లా అధికారులు వెంటనే స్పందించి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థుల కష్టాలను తీర్చేలా కృషి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి



పాఠశాలలో అన్ని వసతులు బాగున్నా, మరుగుదొడ్ల సమస్యల పిల్లలను వేదిస్తోంది. చీటికి మాటికి మరుగుదొడ్లు నిండి పిల్లలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించాలి.

-బలరాం,ఉప్పరపల్లి ,చిట్వేలి

క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించాలి



ప్రభుత్వం పాఠశాలల్లో పిల్లలకు అన్ని రకాల వస్తువులు కల్పించాలి. క్రీడా మైదానం పిచ్చిమొక్కలతో నిండిపోయి ఆడుకునేందుకు వీలులేకుండా ఉంది. మరుగుదొడ్ల సమస్య కూడా పిల్లలను వేదిస్తోంది. బాలికలు ఉన్న పాఠశాల కనుక అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

-నాగమునెమ్మ, గాంధీనగర్, చిట్వేలి

రిజర్వేషన్లకు తూట్లు పొడవడం అన్యాయం


మేమెంతో మాకంత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

రిజర్వేషన్లకు తూట్లు పొడవడం తీవ్ర అన్యాయమని బిసిఇఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఉద్యోగుల నాయకులతో కలిసి మేమెంతో మాకంత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిబిఎస్ రెండవ రౌండ్ అడ్మిషన్స్‌లో రిజర్వేషన్ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని ఆయన తప్పుపట్టారు. రిజర్వేషన్ అమలులో పారదర్శక పద్ధతి అనుసరించాలని, ముందస్తుగా గుర్తింపు సంఘాల నాయకులతో చర్చించి , విధివిధానాలు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని సూచించారు. రిజర్వేషన్ కేటగిరిలో సీట్లు పొందవలసిన అనేక మంది రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు వైద్య సీట్లు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు నిబంధనల మేరకు మొట్టమొదట ఓపెన్ కేటగిరి సీట్లను కేవలం ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉందని, అలాంటపుడు 54 వేల ర్యాంక్ పొందిన రిజర్వేషన్ వర్గాల అభ్యర్థికి రిజర్వేషన్ కేటగిరిలో సీటు కేటాయించి 60 వేల ర్యాంక్ పొందిన అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో ఏ విధంగా కేటాయిస్తారో సమాధానం చెప్పాలన్నారు. యూనివర్సిటీ అధికారులు విరుద్ధంగా అభ్యర్థులు పెట్టుకొన్న కొన్ని ఆప్షన్లను తొలగించి తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి ఓపెన్ కాంపిటీషన్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి రిజర్వేషన్ లో సీట్లు కేటాయించి రిజర్వేషన్ అభ్యర్థులకు ద్రోహం తలపెట్టారని విమర్శించారు. వైద్య విద్య అడ్మిషన్స్ ను తక్షణమే రద్దు చేసి నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు శంకర, సుబ్రమణ్యం, హరి, రెడ్డిమోహన్, రామాంజులు, హరినాథ్, గంగరాజు, మురళి పాల్గొన్నారు.

పిబిసి కెనాల్ నిర్వహణపై నిర్లక్ష్యం

గురిజాల సమీపంలోని అక్విడెట్ వద్ద ఏర్పడిన పెద్ద రంధ్రం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పులివెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) నిర్వహణపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కెనాల్ పరిధిలో నియోజవర్గంలోని పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, లింగాల, వేంపల్లి మండలాల్లోని 55,580 ఎకరాల ఆయికట్టు సాగునీరు అందించాల్సింది. ప్రధానంగా అనంతపురం జిల్లాలోని కల్లూరు, సింగవరం, కడప జిల్లాలోని తొండూరు, బలపనూరు డిస్ట్రిబ్యూటర్లతోపాటు కామసముద్రం చెరువు అనంతరం మరో 30 చిన్న డిస్ట్రిబ్యూటర్ల నుంచి సాగునీటిని ఆయకట్టు భూమికి చేరేలా రూపకల్పన చేశారు. అయితే గత రెండేళ్ల నుంచి ప్రధాన కాలువలలో మట్టి, కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీరు సరఫరాకు ప్రధాన అడ్డంకిగా మారాయి. నియోజవర్గానికి సాగునీరు అందించడానికి పార్నపల్లి వద్ద దాదాపు 10 టిఎంసి సామర్థ్యం కలిగిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, అలాగే పైడిపాలెం జలాశయం నుంచి ఆరు టిఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్లు ఉన్నాయి. ఈ రిజర్వాయర్ల నుంచి నియోజవర్గంలోని చక్రాయపేట మండలం మినహా అన్ని మండలాలకు సాగునీరు అందిస్తున్నారు.

అక్విడెట్‌కు భారీ రంధ్రం

తొండూరు డిస్ట్రిబ్యూటర్ పరిధిలోని గురిజాల సమీపంలో ఏర్పాటు చేసిన అక్విడెట్ (బ్రిడ్జి)కు భారీ రంధ్రం పడటంతో నీరు వృథా అవుతోంది. గతేడాది నుంచి అక్విడెట్‌కు మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు పలుమార్లు పరిశీలించినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఈ అక్విడెట్ దాదాపు 300 మీటర్ల మేరకు ఉంది. దీనిలో సైతం పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీటి సరఫరాకు అవరోధం కలుగుతోంది. గడిచిన మూడేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలాశయాల్లో నీరు పుష్కలం ఉంది. నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ కాలువల నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని కాలువల్లోని పిచ్చి మొక్కలు తొలగించడంతోపాటు, అక్విడెట్ మరమతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


అక్విడెట్‌కు ఏర్పడిన భారీ రంధ్రం, కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు, కంపచెట్లు

త్వరలోనే మరమ్మతులు చేపడతాం

గురిజాల సమీపంలోని అక్విడెట్ మరమ్మతుకు గురైన విషయం మా దృష్టికి వచ్చింది. పనులను త్వరలోనే చేపడతాం. ఇందుకు సంబంధించి అంచనా నివేదించాం. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే కాలంలోని పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, ఇఇ, పులివెందుల బ్రాంచ్ కెనాల్

దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తాము ఉమ్రా నుండి దొంగగా బంగారు తెచ్చామని, పోలీసులు కేసు నమోదు చేశారని, దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అల్ నూర్ ట్రావెల్స్ అధినేత చాంద్‌బాషా హెచ్చ రించారు. ఆదివారం ఆయన తన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 10న ఉమ్రా యాత్ర ముగిం చుకుని హైదరా బాద్ విమానాశ్రయానికి చేరుకోగా అక్కడ కస్టమ్స్ అధికారులు తన లగేజిని చెక్ చేశారన్నారు. తన వద్ద ఉన్న ఆరు మెడలో గొలుసులకు పన్ను కట్టి రసీదు తీసుకోవాలని అధికారులు చెప్పగా, ఒక లక్ష 38 వేల రూపాయలు చెల్లించి బయటికి వచ్చానన్నారు నాతో పాటు 20 మంది ఉమ్రా యాత్రికులు చెకింగ్ అనంతరం బయటకు వచ్చా మన్నారు. తన సోదరుడి కుమారుడు మమ్ములను విమానాశ్రయం నుండి ప్రొద్దుటూరుకు తీసుకుపోవడానికి బస్సు తీసుకొని విమానాశ్రయం చేరుకు న్నారన్నారు. తాను వాష్ రూమ్‌కు వెళ్లే క్రమంలో తన అన్న కొడుకు దగ్గర ఆరు మెడలో గొలుసులు ఉంచి వెళ్లానన్నారు. అక్కడ పోలీ సులు చెకింగ్ చేస్తున్న క్రమంలో ఒక వ్యక్తి దగ్గర 600 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకొని అక్కడే ఉన్న తమ సోదరుని కుమారుడును కూడా తనిఖీ చేశారు. అతని వద్ద ఆరు బంగారు గొలుసులు ఉన్నాయని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. విషయం తెలుసుకున్న తాను వెంటనే పోలీసులకు తాను చెల్లించిన పన్ను రసీదును చూపించామన్నారు. తక్షణమే పోలీసులు తమను పంపించేశారన్నారు. తమపై ఎలాంటి కేసులు, ఎఫ్ఐఆర్ కానీ నమోదు కాలేదన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక నగరిగుట్ట ప్రాంతానికి చెందిన సాతుపాటి శీనుతోపాటు 50 మంది యువకులు బీటెక్ రవి ఆధ్వర్యంలో ఆదివారం టిడిపిలో చేరారు. వీరిని ఆర్.శ్రీనివాసరెడ్డి ఆహ్వానించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ చంద్రబాబు జైల్లో ఉన్నా కూడా స్వచ్ఛందంగా పులివెందుల నుండి తాము సైతం బాబు కోసం అంటూ ఇంతమంది యువకులు టిడిపిలో చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పరిస్థితులు ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా వైసిపి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండని ఆయన తెలిపారు. టిడిపి బలోపేతానికి కృషి చేసి చంద్రబాబుకు అండగా నిలుస్తామన్నారు. పులివెందులలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆర్.శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపారు.

విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాలు అనే అంశంలో భాగంగా ఫాదర్ అమలు ఆరోక్యరాజ్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. మూడు రోజులుగా మిల్లెట్ ఆహారం, ఫుడ్ ఫెస్టివల్, మిల్లెట్స్ ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ప్రొద్దుటూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యాలయం వెలుపల దీక్ష చేపట్టారు. ప్రొద్దుటూరు మహిళా పట్టణ అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో మెరువ నీలిమ వీరికి మద్దతుగా ప్రొద్దుటూరు నియోజకవర్గ అబ్జర్వర్ ఎవిఆర్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆసం రఘురాంరెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, కడప పార్లమెంట్ శిరిగిరెడ్డి నాగమునిరెడ్డి, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 9వ వార్డు కరీముల్లా, శ్రీనివాసులు, 35 వార్డ్ నాగ సుబ్బ రాయుడు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌గా నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కేంద్ర రక్షణశాఖ దేశవ్యాప్తంగా కొత్తగా 23 సైనిక్ స్కూళ్లను మంజూరు చేసింది. ఇందులో రాష్ట్రంలోని పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జడ్‌పి హైస్కూల్‌కు చోటు దక్కిందని పూర్వ విద్యార్థి వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దశలవారీగా 100 సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కేంద్రం విధాన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సైనిక్ స్కూల్స్ సొసైటీ దేశవ్యాప్తంగా 19 పాఠశాలలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో నెల్లూరులోని అదానీ వరల్డ్ స్కూల్ ఉంది. ఇప్పుడు కొత్తగా మరో 23 స్కూళ్లను ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదముద్ర వేసినట్లు రక్షణశాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకుముందు పూర్తి ప్రభుత్వ విధానంలో ఏర్పాటైన 33 సైనిక్ స్కూళ్లలో ఎపి నుంచి కోరుకొండ, కలికిరి స్కూళ్లున్నాయి. దీంతో రాష్ట్రానికి మొత్తం 4 స్కూళ్లు దక్కినట్లయింది.


కుక్కలను వేటాడుతున్న పంచాయతీ సిబ్బంది

పిచ్చి కుక్క వీరంగం

-20 మందికి గాయాలు

ప్రజాశక్తి-కలికిరి

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలైన సంఘటన ఆదివారం కలికిరి పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని కట్ట కింద పాలెం నుంచి పిచ్చికుక్క రోడ్డుపైన పరిగెత్తుకుంటూ కనపడును వారిని కనపడినట్లే కరిచి గాయపరచిందన్నారు. టివిరోడ్డు లోని ప్రసాద్ థియేటర్ వరకు రోడ్డుపై వెళ్తున్న సుమారు 20 మందికి గాయాలు చేసినట్లు తెలిపారు. పిచ్చి కుక్క కాటుకు గురైన బాధితులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసుకున్నారు. ఈ సందర్భంగా కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నలభై వీధి కుక్కలను పట్టించామని మిగిలిన కుక్కలు ఎక్కడైనా ఉంటే సమాచారం అందివ్వాలని ప్రజలను కోరారు.

వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతను, చంద్రబాబుపై చేస్తున్న అసత్య ప్రచారంపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి సూచించారు. ఆదివారం మైదుకూరులో టిడిపి నాయకులు తలపెట్టిన 5వ రోజు రిలే నిరాహార దీక్షలో ఖాజీపేట మండల నాయకులు పాల్గొన్నారు. రిలే నిరాహారదీక్షలో నాయకులకు లింగారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి వైసిపి అవినీతిని వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త సెనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు సుబ్బారెడ్డి, బిసి నాయకులు మేకల బాబు, కౌన్సిలర్ రాధాకృష్ణ, లక్ష్మిరెడ్డి, జనసేన నాయకులు క్రిష్ణమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా నలు మూలల నుండి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 14ఏళ్లలోపు బాలబాలికలకు 60మీ, 600మీ, కిడ్స్ జావెలిన్, లాంగ్‌జంప్ హైజంప్, 16 ఏళ్లలోపు బాల బాలికలకు 100మీ, 300మీ, 800మీ. షార్ట్‌పుట్ డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, 18ఏళ్లలోపు బాలబాలికలకు 100మీ, 200మీ, 400మీ, 800మీ, 1500మీ, షాట్‌పుట్ డిస్కస్‌త్రో జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, 20ఏళ్లలోపు మహిళలు, పురుషులకు 100మీ, 200మీ, 400మీ, 800మీ, 1500మీ షార్ట్‌ఫుట్, డిస్కస్‌త్రో జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ 23ఏళ్లలోపు వారికి 100మీ, 200మీ, 400మీ, 800మీ, 1500మీ. షార్ట్‌ఫుట్ డిస్కస్‌త్రో, జావె లిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన వారు ఈ నెల 20 నుండి 23వ తేదీవరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణం గుంటూరులో జరుగబోయే ఎపిస్టేట్ జూని యర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ క్రీడలలో గెలపొందిన వారికి ప్రశంశాపత్రాలు అందజేశారు. వ్యాయామ సంచాలకులు బనగానపల్లి బాషా, నరేస్, డిఎవిబి లక్ష్మినాగేశ్వరరావు, రాజశేఖర్, అహ్మర్‌బాషా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాలు ఢీ

-పలువురికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఆదివారం సాయంత్రం అగ్రహారం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన యువకులు నిమ్మనపల్లి నుంచి వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌లో పెట్టి తరలిస్తుండగా, ట్రాక్టర్ కు ముందు బండమీదపల్లెకు చెందిన కె.ప్రశాంత్‌కుమార్, ఎం.గణేష్ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారని చెప్పారు. మంచుకుంటపల్లెకు చెందిన సంతోష్ అగ్రహారం నుంచి ఎదురుగా మరొక ద్విచక్ర వాహనంలో వస్తూ అగ్రహారం సమీపంలోని మలుపు వద్ద వేగంగా ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాల్లో వస్తున్నా ముగ్గురికి గాయాలైనట్లు తెలిపారు. ప్రశాంత్ కుమార్, గణేష్‌లను నిమ్మనపల్లి పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా మదనపల్లెకు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పట్టణంలోని బెంగుళూరు రోడ్డులో నివాసమున్న నరసింహులు గర్భిణి అయిన తన భార్య లక్ష్మీదేవిని ద్విచక్ర వాహనంలో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి బయలుదేరారని తెలిపారు. మార్గమధ్యంలోని నాయునిభావి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొని దంపతులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గాయపడ్డ బాధితులను 108 సిబ్బంది చికిత్సల నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు వారికి వైద్య పరీక్షలు అందించి స్కానింగ్ చేయడంతో గర్భిణి లక్ష్మీదేవికి ఎలాంటి ప్రమాదం లేదని, ఆమె భర్తకు గాయాలు కావడంతో ప్రాణాపాయం తప్పిదని ఊపిరిపించు కున్నారన్నారు.ఈ ఘటన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో అమానుషం...

-వైద్యం అందలేదని టిబి రోగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన రోగి రమేష్ బాబు

వైద్యులు సరైన వైద్యం అందించ లేదని మనస్థాపంతో బ్లేడుతో గొంతుకోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసుల కథనం మేరకు వివరాలు.. పీలేరు నియోజకవర్గం లోని వాల్మీకిపురం రామారావు కాలనీ చెందిన రమేష్ బాబు(60) క్షయ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని చెప్పారు. వ్యాధి తీవ్రత అధికం కావడంతో చికిత్స నిమిత్తం ఆదివారం సాయంత్రం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చారని తెలిపారు. ఆస్పత్రిలోని వైద్య సిబ్బంది రోగికి వైద్యం అందించకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మనస్థాపం చెందినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది చికిత్సలు చేయలేదని మనస్థాపం చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆస్పత్రిలోనే ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారని అన్నారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు అతనికి మెరుగైన వైద్యం అందించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రూయాకు వెళ్లాలని డాక్టర్లు రెఫర్ చేశారన్నారు. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారంతో వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.